3. సోముడు :

ఋగ్వేదంలోని కర్మకాండకు సోమరసానికి మిక్కిలి దగ్గర సంబంధం ఉంది. అందువల్ల ఈ సోమరసం, దీనికి అధిదేవతయైన సోముడు ఋగ్వేదంలో విస్తృతంగా వర్ణింపబడ్డారు. సోమలత, సోమరసాలే దేవతగా రూపొందింపబడి వర్ణింపబడినట్లు పాశ్చాత్యుల

నమ్మకం. ఋగ్వేదంలో తొమ్మిదవమండలం పూర్తిగాను, ఇతరమండలాల్లో 6 సూక్తాలు ఈ దేవతను వర్ణిస్తున్నాయి.

ఇతరదేవతల శరీరావయవాలు వర్ణింపబడినట్లుగా ఈ దేవత శరీరావయవాలు వర్ణింపబడలేదు. బహూనేత్రుడుగాను (9-26), సహస్రాక్షుడుగాను (9-60) ఇతడు వర్ణింపబడ్డాడు. ఇంద్రుని వీరకృత్యాలన్నీ సోమపానంవల్ల కలిగినవే అని ముందే చెప్పబడింది. అందుచేత ఈ సోమదేవత ఇంద్రుని ఆత్మగా (9-85), యుద్ధానికై పుట్టినట్లు (1-91), శూరులందరిలో గొప్ప శూరుడని (9-66), అపజయం తెలియనివాడని (9-66), రాక్షసులను, దుష్టులను సంహరించేవాడని (9-49, 9-28) వర్ణింపబడ్డాడు. ఈ సోముడు 'సూర్యా' అనే దేవతను వివాహమాడినట్లు (10-85) కూడా ఉంది. వైదికకాలం తరువాత సోమపదం చంద్రునిలో రూఢమైంది. అందువల్ల ఋగ్వేదంలో కూడ సోమదేవత అంటే చంద్రుడే అని కొందఱి అభిప్రాయం. ఇతడు లతారూపుడు కావటంచేత 'వనస్పతి' (1-91) అని, ఇతర దేవతలలాగా పాలకుడని (9-97) వర్ణింపబడ్డాడు.

సోమరసం ఔషధరూపంగా వర్ణింపబడింది. అందుచేత ఈ సోమదేవత గ్రుడ్డివారికి దృష్టిని, అవయవహీనులకు ఆయా అవయవాలను ప్రసాదిస్తాడని (8-60, 10-25) వర్ణింపబడింది. ఇతడు మానవ శరీరరక్షకుడు (8-48). సుదీర్ఘమైన ఆయుర్దాయం ఇతని చేతిలో ఉంది (1-91, 9-4). అసత్యాన్ని రూపుమాపి, సత్యాన్ని రక్షించటం ఇతని విధి.

సోమరసం త్రాగినవెంటనే మూగవాడు మాట్లాడగలడు. అందుచేత ఈ దేవత 'వాచస్పతి' అని (9-26, 9-101) పిలువబడుతున్నాడు. ఇతడు ప్రజ్ఞకు అధిపతిగాను, ఋక్కులకు జనకుడుగాను, నాయకుడుగాను, ప్రచారకుడుగాను వర్ణింపబడ్డాడు.

ఇతడు కవులకు నాయకుడు. ఋత్విక్కులకు ఋత్విక్కు (9-96), యజ్ఞానికి ఆత్మ (9-2). దివ్యదృష్టితో ప్రాణులందరిని పరిశీలించ గలవాడీతడు (9-71).

తనను సేవించేవారికి ఆవులను, గుఱ్ఱాలను, రథాలను, బంగారాన్ని, స్వర్గాన్ని, జలాలను, అనేకవరాలను ఇతడివ్వగలడు (9-78). ఒక్కటేమిటి కోరినదేదైనా ఇస్తాడు (8-68). అందుచేత ఇతడు దేవతల ధనంగా వర్ణింపబడ్డాడు (9-48). మానవులను తమ శత్రువులనుంచి ఇతడు కాపాడగలడు (10-25). యజ్ఞంలో ఉపయోగించే సోమరసాన్ని తీసే పద్ధతిని కూడ ఋగ్వేదం వివరిస్తున్నది[1].

7. సోముడు :

సోముడు ప్రకాశవంతమైనవాడు. ఆహ్లాదకరుడు. అమృతమయుడు (4-26). ఇతడు ఇంద్రుని ఎదుఱుగా ఉంచుకొని యజమానికోరినవాటిని ఇస్తాడు (7-12). దేవతలకే ప్రభువట. ప్రథమ బృహస్పతియట (7-15). ఇతడు హరితవర్ణుడు. అనుష్టుప్ ఛందస్సంటే ఈతనికిష్టం (8-47). ఈ పవమానుడే సూర్యుని పుట్టించాడట (22-18). ఓషధులను పుట్టించాడట. అంతరిక్షాన్ని విస్తరింపజేశాడట (34-24). ఇతడు యజమానులకు గవాశ్వసంపదను, వీరులైన పుత్రులను కలుగజేస్తాడు (34-21). దేవతలకు హవిస్సైన ఇతడు మూడులోకాల్లో మూడు రూపాలను ధరించాడట (6-33). గాయత్రియే శ్యేనరూపం దాల్చి సోముని భువికి తీసికొని వచ్చిందట (5-1). ఈ సోముడు శ్యేనరూపంలో దుర్జనుల్ని శిక్షిస్తాడు (4-34).

ధ్రువసదుడు, నృషదుడు, మనస్సదుడు, అప్సుషదుడు, ఘృతసదుడు, వ్యోమసదుడు, పృథివీసదుడు, అంతరిక్షసదుడు, దివిసదుడు, దేవసదుడు, నాకసదుడు, అని సోముడు పిలువబడుతున్నాడు. (9-2)

సోమలతను ఛేదించి తలపాగా చుట్టి, ఒకచోట రంధ్రం పెడతారట. దానిద్వారా సోమదేవత ఊపిరి పీల్చుకొంటుందని వారి విశ్వాసం (4-25). హోమార్హమైన సోమాన్ని రక్షించే దేవతలు ఏడుగురు, స్వానుడు (ధ్వనిచేసేవాడు), భ్రాజుడు (ప్రకాశించేవాడు) అఙ్ఘారి (పాపాలను పోగొట్టేవాడు), బంభారి (విశ్వాన్ని భరించేవాడు), హస్తుడు (ఎల్లప్పుడు సంతోషంగా ఉండేవాడు) సుహస్తుడు (మంచిచేతులు కలవాడు), కృశానుడు (దుర్బలులను జీవింపజేసేవాడు) (4-27).

సోమయాగంలో సోమసంకల్పం నుంచి అవభృథం వరకు సోమునకు ముప్పైనాలుగు అవస్థలు. ఆయా అవస్థలకు తగ్గట్టు సోమునికి ముప్పైనాలుగు పేర్లు చెప్పబడ్డాయి. అవి_యజమానిచేత సోమయాగం కోసం సంకల్పింపబడ్డ సోముడు **'పరమేష్ఠి'** అని, సంకల్పప్రకాశకమైన వాక్యగతుడు **'ప్రజాపతి'** అని, అభిముఖ్యం పొందినప్పుడు **'అంధుడ'**ని, సంభజనంలో **'సవిత'** అని, దీక్షితుడైన తరువాత **'విశ్వకర్మ'** అని, సోమక్రయణియైన గోవును తీసికొని వచ్చిన తరువాత **'పూష'** అని, క్రయ విక్రయ వ్యవహారానికై తీసుకొనిరాబడి **'ఇంద్రామరుత్త'**ని, కొనబడుతున్నపుడు **'అసురుడ'**ని, కొనబడినవాడై **'శిపివిష్టవిష్ణువ'**ని, యజమాని ఒడిలోకి చేరిన సోముడు **'నరంధిషవిష్ణువ'**ని, బండిపై తెచ్చి దింపబడినప్పుడు సోముడని, మంచెపైన ఉంచబడినప్పుడు **'వరుణుడ'**ని, అగ్నీధ్రమం దుంచబడినప్పుడు **'అగ్ని'** అని, హవిర్ధానం [illegible]

లో ఉంచబడి **'ఇంద్రుడ'**ని, చిన్నముక్కలుగా చేయటానికి తీసుకొని పోబడేటప్పుడు **'అథర్వ్యుడ'**ని, ముక్కలుగా కోయబడి 'విశ్వేదేవుడ'ని, ఆప్యాయనం చేసేటప్పుడు **'ఆప్రీతపయనవిష్ణువ'**ని, పిండబడేవాడై **'యముడ'**ని, పాత్రలలో భరింపబడువాడై **'విష్ణువ'**ని, వడకట్టబడువాడై **'వాయువ'**ని, వడకట్టబడిన తరువాత క్షీరమిశ్రితుడై 'శుక్రుడ'ని, సక్తుమిశ్రితుడై **'మంథి'**యని, గ్రహపాత్రలలో గ్రహింపబడి **'విశ్వేదేవుడ'**ని, హోమార్థమై గ్రహింపబడి **'అసువ'**ని, హోమం చేయబడుతూ **'రుద్రుడ'**ని, హోమశేషాన్ని ప్రసాదంగా తీసికొని పోబడుతూ **'వాతుడ'**ని, భక్షణార్థమై కోరబడుతూ **'నృచక్షా'** అని, భక్షింపబడుతూ **'భక్షుడ'**ని, భక్షింపబడినవాడై 'నారాశంసుడ'ని, అవబృథంకోసం తీసికొనబడి **'సింధువ'**ని, జలాభిముఖంగా తీసికొని పోబడుతూ 'సముద్ర'మని, నీళ్లలో కలుపబడ్డ తరువాత 'సలిల'మని, సోముడు పిలువబడుతాడు.[1]

4. సోముడు - చంద్రుడు :

అగ్నిషోమాత్మకమైన క్రతువులో సోముడొక ప్రధానదేవత. సోమలత యజ్ఞాంగమైన ప్రధానద్రవ్యం. సోముడే ఒక ప్రత్యేకదేవతగా అథర్వవేదంలో ప్రస్తుతింపబడ్డాడు. కులపాంసని (కులాన్ని అపవిత్రంచేసేది) అయిన స్త్రీకి కష్టనష్టాలు కలుగజేయవలసిందిగా సోముని ప్రార్థించటం జరుగుతుంది (1.3.3). ఈయన అవివాహితయైన స్త్రీకి సౌభాగ్యాన్ని ప్రసాదిస్తాడు (2.6.5). ఈ సందర్భంలో సోముని రాజుగా అభివర్ణించింది అథర్వవేదం. వాణిజ్యంలో లాభంకోసం చేసే ప్రార్థనలో గూడ ఇంద్రుడు, ప్రజాపతి మొ॥ దేవతలతోబాటు సోముని ప్రసక్తికూడ ఉన్నది (3.3.5). గృహగోష్ఠాదుల్లో రాక్షసబాధా నివృత్తికోసం సోముడు కూడా సహాయం చేస్తాడు (3.5.1). శత్రుసంహారానికి వెళ్తూ ఉన్న సేనానివహాన్ని సోముడు ఉత్తరంవైపు నుంచి రక్షిస్తాడు (3.6.1).

కుష్ఠువ్యాధినివారణకు ఇచ్చే మందు సోముని సఖిగా వర్ణింపబడింది (5.1.4). గోహరణం జరిగినప్పుడు ఆ గోవులను తిరిగి పొందే ప్రయత్నంలో పఠించే మంత్రంలో సోముడు అందరికీ రాజుగాన్నూ, వేదాన్ని అభ్యసించేవారిలో ప్రథముడుగానూ వర్ణింపబడ్డాడు. వరుణుడు, అగ్ని మొ॥ ఇతరదేవతల సహాయంతో సోముడు కూడ, దొంగిలింపబడ్డ గోధనాన్ని తిరిగి తేగలడు (5.4.2,3). శత్రువుల సంహారానికి బయలుదేరేటప్పుడు మోగించే భేరిని ఇంద్రాది దేవతలతోబాటు సోముడు కూడ రక్షించగలడు (5.4.5).